ట్రైనెట్ న్యూస్

నిజం • బాధ్యత • నిబద్ధత

తెలుగు దిన పత్రిక

https: / / trinetnews.com /

తాజా తెలుగు వార్తలు

ప్రతి 3 గంటలకు

98497 67747

9494184136

1PM to 4PM

సంపుటి: 01 / సంచిక:18 / పేజీలు :04 / వేల:2/రూ / ఎడిటర్: వెంకటేశ్వర్లు రాపోలు / బుధవారం , సెప్టెంబర్ 02,2026

తెలంగాణకు డిఫెన్స్ హబ్ దిశగా భారీ అడుగు

- ప్రపంచ పెట్టుబడుల మహాసదస్సుకు రాజ్‌నాథ్ సింగ్‌ను ఆహ్వానించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- డిసెంబరు 7 నుంచి 9 వరకు భారత్ భవిష్యత్ నగరంలో మహాసదస్సు
- రక్షణ ప్రదర్శనను ప్రారంభించాలని కేంద్ర రక్షణ మంత్రికి విజ్ఞప్తి
- వైమానిక విన్యాసాలకు సహకారం అందించాలని కేంద్రాన్ని కోరిన ముఖ్యమంత్రి
- ఆదిలాబాద్ విమానాశ్రయానికి మరో 750 ఎకరాల భూమి సమకూర్చేందుకు రాష్ట్రం సిద్ధం

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు 2:

తెలంగాణను రక్షణ, వైమానిక, అంతరిక్ష రంగాల్లో దేశంలోనే ప్రముఖ పెట్టుబడుల కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న ప్రపంచ పెట్టుబడుల మహాసదస్సుకు హాజరుకావాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను ఆహ్వానించారు. న్యూఢిల్లీలో రాజ్‌నాథ్ సింగ్‌ను కలిసిన ముఖ్యమంత్రి, మహాసదస్సులో భాగంగా నిర్వహించనున్న రక్షణ ప్రదర్శనను ప్రారంభించాలని కోరారు.

డిసెంబరు 7 నుంచి 9వ తేదీ వరకు భారత్ భవిష్యత్ నగరంలో ప్రపంచ పెట్టుబడుల మహాసదస్సును నిర్వహించనున్నట్లు ముఖ్యమంత్రి వివరించారు. రాష్ట్రంలో రక్షణ, వైమానిక, అంతరిక్ష రంగాలకు ఉన్న అవకాశాలను దేశ, విదేశీ పెట్టుబడిదారులకు పరిచయం చేయడమే లక్ష్యంగా ఈ మహాసదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మహాసదస్సులో భాగంగా రక్షణ, వైమానిక, అంతరిక్ష రంగాలకు సంబంధించిన ప్రత్యేక సదస్సులు, పారిశ్రామిక ప్రదర్శనలు, అత్యాధునిక రక్షణ పరికరాల ప్రత్యక్ష ప్రదర్శనలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. రక్షణ రంగంలో దేశీయంగా అభివృద్ధి చేసిన సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రజలకు, పెట్టుబడిదారులకు పరిచయం చేసేలా కార్యక్రమాలను రూపొందిస్తున్నట్లు తెలిపారు.

రక్షణ ప్రదర్శనను అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్వహించేందుకు కేంద్ర రక్షణ శాఖ పూర్తి సహకారం అందించాలని రేవంత్ రెడ్డి కోరారు. ముఖ్యంగా వైమానిక విన్యాసాల ప్రదర్శనకు అవసరమైన అనుమతులు మంజూరు చేయడంతో పాటు భారత వైమానిక దళానికి చెందిన విమానాలు పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సూర్యకిరణ్, సారంగ్ వైమానిక విన్యాస బృందాల ప్రదర్శనకు అనుమతి ఇవ్వాలని కూడా ముఖ్యమంత్రి కోరారు. భారత సైన్యం, నౌకాదళం, వైమానిక దళానికి చెందిన అత్యాధునిక రక్షణ వ్యవస్థలు, పరికరాలు, విమానాలను ప్రదర్శనలో ఏర్పాటు చేసేలా కేంద్ర రక్షణ శాఖ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

దేశంలోని ప్రధాన రక్షణ రంగ ప్రభుత్వ సంస్థలు, రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థకు చెందిన ప్రయోగశాలలు, నూతన రక్షణ సాంకేతిక సంస్థలు, యువ శాస్త్రవేత్తలు ఈ ప్రదర్శనలో పెద్ద ఎత్తున పాల్గొనేలా సహకరించాలని ముఖ్యమంత్రి కోరారు. దేశీయ రక్షణ సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రపంచానికి పరిచయం చేసేందుకు తెలంగాణ వేదిక కావాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిపారు.

విదేశీ రక్షణ ప్రతినిధులు, అంతర్జాతీయ రక్షణ సంస్థల ప్రతినిధులు, వివిధ దేశాల అధికార బృందాలు కూడా మహాసదస్సులో పాల్గొనేలా కేంద్ర ప్రభుత్వం సహకరించాలని ముఖ్యమంత్రి కోరారు. తద్వారా తెలంగాణలో రక్షణ రంగ పెట్టుబడులు పెరగడంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు కూడా విస్తరిస్తాయని తెలిపారు.

ఆదిలాబాద్ విమానాశ్రయానికి 1,500 ఎకరాలు

ఆదిలాబాద్ విమానాశ్రయ అభివృద్ధి అంశాన్ని కూడా ముఖ్యమంత్రి రాజ్‌నాథ్ సింగ్ దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 750 ఎకరాల భూమిని సమకూర్చే ప్రక్రియ చేపట్టిందని తెలిపారు. రక్షణ శాఖ మొత్తం 1,500 ఎకరాల భూమి అవసరమని సూచించిన నేపథ్యంలో మరో 750 ఎకరాల భూమిని కూడా సేకరించి అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.

ఆదిలాబాద్ విమానాశ్రయం అభివృద్ధి చెందితే ఉత్తర తెలంగాణ ప్రాంతానికి రవాణా సదుపాయాలు మరింత మెరుగుపడటంతో పాటు పారిశ్రామిక అభివృద్ధికి కూడా దోహదపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

మహబూబ్‌నగర్‌లో కీలక రక్షణ ప్రాజెక్టు

మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలంలో రక్షణ పరిశోధన అభివృద్ధి ప్రయోగశాల ఆధ్వర్యంలో చేపట్టనున్న కీలక ప్రాజెక్టుకు 416.18 ఎకరాల భూమిని కేటాయించేందుకు రాష్ట్ర పారిశ్రామిక మౌలిక వసతుల సంస్థ అంగీకరించినట్లు ముఖ్యమంత్రి తెలిపారు.

ఈ భూమిని మొత్తం విస్తీర్ణానికి సంవత్సరానికి నామమాత్రంగా ఒక రూపాయి అద్దెతో 33 సంవత్సరాల పాటు కేటాయించే ప్రతిపాదన ఉందని వివరించారు. అవసరమైతే భవిష్యత్తులో లీజు కాలాన్ని పొడిగించే అవకాశం కూడా కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

తెలంగాణలో రక్షణ, వైమానిక, అంతరిక్ష రంగాల్లో పెట్టుబడులను భారీగా ఆకర్షించడంతో పాటు హైదరాబాద్‌ను అంతర్జాతీయ స్థాయి రక్షణ సాంకేతిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతోంది. ప్రపంచ పెట్టుబడుల మహాసదస్సు, రక్షణ ప్రదర్శన ద్వారా దేశీయ, విదేశీ పెట్టుబడులను ఆకర్షించి తెలంగాణను రక్షణ రంగంలో అగ్రగామి రాష్ట్రంగా నిలపాలన్న లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు వేగవంతం చేస్తోంది.

గుర్తింపు సంఘం ఎన్నికల తర్వాతే ఆర్టీసీ విలీనం:

మంత్రి పొన్నం ప్రభాకర్

ట్రైనెట్ న్యూస్, 02 సెప్టెంబర్ 2026

టీజీ: రాష్ట్రంలో ఆర్టీసీని ప్రభుత్వంలో పూర్తిస్థాయిలో విలీనం చేసే ప్రక్రియపై మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టతనిచ్చారు. బస్ భవన్‌లో 'వెయ్యి రోజుల ప్రజా పాలన' సందర్భంగా రవాణా శాఖ సాధించిన ప్రగతిని ఆయన మీడియాకు వివరించారు.

విలీన ప్రక్రియపై స్పష్టత: ఆర్టీసీ కార్మికుల భవిష్యత్తు, సంస్థ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ముందుగా గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహిస్తామని మంత్రి తెలిపారు. ఎన్నికల్లో గెలిచిన కార్మిక ప్రతినిధులతో కమిటీ ఏర్పాటు చేసి, ఆ విలీన ప్రక్రియను పూర్తి చేస్తామని వెల్లడించారు.

జాగ్రత్తలు: ఏపీలో విలీనం సందర్భంగా ఏర్పడిన ఇబ్బందులు తెలంగాణలో రాకుండా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు.

ప్రత్యేక సమావేశం: ఈ నెల 7న కార్మిక సంఘాలతో గుర్తింపు సంఘం ఎన్నికలపై ప్రత్యేక సమావేశం జరగనుంది.

పేదల ఇళ్ల కోసం ఆర్టీసీ స్థలాలిస్తే తప్పేంటి?: మంత్రి పొన్నం

ట్రైనెట్ న్యూస్,

తేదీ: సెప్టెంబర్ 2, 2026

పేదలందరికీ ఇళ్ల నిర్మాణం కోసం ఆర్టీసీ భూములు మరియు స్థలాలు కేటాయించడంలో ఎలాంటి తప్పు లేదని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పలు కీలక అంశాలను వెల్లడించారు.

మహాలక్ష్మి పథకం నిధులు: 'మహాలక్ష్మి' పథకం కింద ఆర్టీసీ సంస్థకు ప్రభుత్వం ఇప్పటివరకు రూ. 10 వేల కోట్లు అందజేసినట్లు ఆయన తెలిపారు.

ఆస్తుల విభజన చర్చలు: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య ఉమ్మడి ఆస్తుల విభజనకు సంబంధించి ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఇప్పటికే చర్చించుకున్నారని వెల్లడించారు.

ఆర్టీసీ విలీనంపై నిర్ణయం: ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం అంశంపై రివ్యూ కమిటీ నివేదికను పూర్తిగా పరిశీలించి, ఆ నివేదిక ఆధారంగా తగిన నిర్ణయం తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు.

ఏపీఉపముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత కొణిదల పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు.

సెప్టెంబర్ 02 ట్రైనెట్ న్యూస్, రిపోర్టర్

కైకలూరు మార్కెట్ యార్డులోని ఫంక్షన్ హాల్. ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ అస్యూరెన్స్ కమిటీ చైర్మన్, కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్.కామినేని శ్రీనివాస్ సమక్షంలో కైకలూరు దానగూడెం ప్రాంతానికి చెందిన పలువురు యువకులు పెద్ద ఎత్తున ఎన్డీఏకూటమి జనసేన పార్టీలో చేరారు. నాయకుల సమక్షంలో కేక్ కట్ చేసి పవన్ కళ్యాణ్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పేద ప్రజల కోసం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఇతర ముఖ్య నాయకులు: మాజీ శాసనమండలి సభ్యులు కమ్మిలి విఠల్ రావు, కొల్లు బాబి ఎన్డీఏ కూటమి నాయకులు మరియు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బోనకల్లు వద్ద రోడ్డు ప్రమాదం. త్రుటిలో తప్పిన ప్రాణాపాయం.

ట్రైనెట్ న్యూస్,: మధిర

బోనకల్లు వద్ద లారీ బోల్తా హోంగార్డు నరేష్‌కు గాయాలు, త్రుటిలో తప్పిన ప్రాణాపాయం విధుల నిమిత్తం ప్రయాణిస్తున్న ఓ హోంగార్డు లారీ ప్రమాదానికి గురైగాయపడినఘటనబోనకల్లుసమీపంలోచోటుచేసుకుంది.

మధిర పట్టణానికి చెందిన నరేష్ ఖమ్మం రైల్వే స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్నారు. విధి నిర్వహణ కోసం ఆయన ఖమ్మం బయలుదేరగా, బోనకల్లు వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే క్రమంలో డ్రైవర్ నియంత్రణ కోల్పోయాడు. దీంతో లారీ అదుపుతప్పి రోడ్డుపై ఒక్కసారిగా బోల్తా పడింది. ఈ ప్రమాదంలో లారీలో ప్రయాణిస్తున్న హోంగార్డు నరేష్‌కు గాయాలయ్యాయి. వెంటనే స్పందించిన స్థానికులు ఆయనను చికిత్స నిమిత్తం సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికితరలించారు. ప్రస్తుతం ఆయన ప్రాణాపాయం నుంచి బయటపడినట్లు వైద్యులు వెల్లడించారు.

మోటూరులో ఇంటి చోరీ కేసు ఛేదింపు

రూ.4.20 లక్షల విలువైన బంగారు ఆభరణాలు స్వాధీనం.. నిందితుడి అరెస్ట్

గుడివాడ నియోజకవర్గం ట్రైనెట్ న్యూస్,

గుడివాడ మండలం మోటూరు గ్రామంలో ఇంటి బీరువా లాకర్‌ను పగులగొట్టి బంగారు ఆభరణాలు చోరీ చేసిన కేసును పోలీసులు ఛేదించారు.

ఈ కేసుకు సంబంధించి మోటూరు గ్రామానికి చెందిన తాడిపర్తి అశోక్‌కుమార్‌ను అరెస్ట్ చేసి, రూ. 4.20 లక్షల విలువైన 48.014 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు గుడివాడ రూరల్ సీఐఎస్.ఎల్.ఆర్. సోమేశ్వరరావు తెలిపారు.

మోటూరులో ఇంటి కేసును చేదించిన రూరల్ ఎస్సై చంటిబాబు

గుడివాడ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీఐ కేసు వివరాలను వెల్లడించారు. మోటూరుకు చెందిన గండికోట శివపార్వతి ఇంటిలో బీరువా లాకర్‌ను పగులగొట్టి బంగారు ఆభరణాలు అపహరించిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

ఎస్‌డీపీవో పాలా శ్రీనివాస్ పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి మోటూరు, పరిసర ప్రాంతాల్లో విచారణ చేపట్టగా లభించిన ఆధారాల ఆధారంగా అశోక్‌కుమార్‌ను నిందితుడిగా గుర్తించినట్లు సీఐ తెలిపారు. నిందితుడి వద్ద, అతని ఇంటి వద్ద నుంచి బంగారు చైన్, బ్రాస్లెట్‌తో పాటు తాకట్టు పెట్టిన బంగారు ఆభరణాలను పోలీసులు రికవరీ చేసినట్లు వెల్లడించారు. మొత్తం 48.014 గ్రాముల బంగారు ఆభరణాలు, వాటి విలువ సుమారు రూ. 4.20 లక్షలు ఉంటుందని తెలిపారు.

కేసును త్వరితగతిన ఛేదించి చోరీ సొత్తును రికవరీ చేసిన రూరల్ ఎస్ఐ ఎన్.చంటిబాబు, సీసీఎస్ ఎస్ఐ సత్యనారాయణ, పోలీసు సిబ్బందిని సీఐ అభినందించారు.

వారి పనితీరును ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి రివార్డుకు సిఫారసు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నందివాడ మండలంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతి వేడుకలు ఘనంగా జరిగినాయి

నందివాడ..మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 17వ వర్ధంతి వేడుకలను నందివాడ గ్రామంలో ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ విగ్రహానికి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం ఆయన చేసిన ప్రజాసేవలను, అమలు చేసిన సంక్షేమ పథకాలను నాయకులు గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పేదలు, రైతులు, మహిళలు, విద్యార్థులు, ఆరోగ్య రంగానికి పెద్దపీట వేశారని పేర్కొన్నారు. రైతులకు ఉచిత విద్యుత్, పేదలకు ఆరోగ్య సేవలను చేరువ చేసే ఆరోగ్యశ్రీ, అత్యవసర వైద్య సేవల కోసం 108, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతుల కోసం జలయజ్ఞం వంటి కార్యక్రమాలు ప్రజల జీవితాల్లో చెరగని ముద్ర వేశాయని

అన్నారు. అలాగే పేదలకు ఇళ్ల నిర్మాణం, మహిళా సంఘాలకు ప్రోత్సాహం, సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యత కల్పించడం ద్వారా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి వైఎస్సార్ విశేష కృషి చేశారని నాయకులు తెలిపారు. పేదవాడి ముఖంలో చిరునవ్వు చూడాలన్నదే వైఎస్సార్ పాలనకు ప్రధాన లక్ష్యమని గుర్తుచేశారు. వైఎస్సార్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు నేటికీ ప్రజల మదిలో నిలిచిపోయాయని, ఆయన ఆశయాలను కొనసాగించడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో నందివాడ మండల ఎంపీపీ పెయ్యల ఆదాం, కృష్ణాజిల్లా జనరల్ సెక్రెటరీ కందుల నాగరాజు, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ తోటా నాగరాజు,సరేళ్ళ నాగేశ్వరరావు, కొండపల్లి రంగారెడ్డి, ములిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, రాజుల పార్టీ చంద్రశేఖర్, తమ్మినేని రోమేశ్వరరావు, మలిరెడ్డి కృష్ణారెడ్డి, బట్టిపాటి శ్రీనివాసరెడ్డి, జగదీష్,పెయ్యల సాగర్, ములిరెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి, గుళ్లపూడిచంద్రశేఖర్,శ్రీను, నాగూర్,నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

1,000 రోజులు.. 420 హామీలు.. ఇదేనా కాంగ్రెస్ పాలన?

శంకర్‌పల్లిలో 420 హామీల ఫ్లెక్సీతో బీఆర్ఎస్ నిరసన.. హామీల అమలుపై ప్రభుత్వాన్ని నిలదీసిన నాయకులు

శంకర్‌పల్లి,(ట్రైనెట్ న్యూస్,)

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1,000 రోజులు పూర్తవుతున్న సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శంకర్‌పల్లి మండల కేంద్రంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 420 హామీలను ప్రస్తావిస్తూ రూపొందించిన ఫ్లెక్సీని ప్రదర్శిస్తూ బీఆర్ఎస్ నాయకులు నిరసన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమైందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. 1,000 రోజుల పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, హామీల అమలుపై ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకే ఈ నిరసన చేపట్టినట్లు తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. హామీల అమలు, ప్రభుత్వ పనితీరుపై ప్రజల్లో

అవగాహన కల్పించేందుకు రానున్న రోజుల్లో మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తామని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు శశిధర్‌రెడ్డి, మాజీ ఎంపీపీలుగోవర్ధన్‌రెడ్డి,నర్సింలు,బీఆర్ఎస్‌సీనియర్‌నాయకులు వాసుదేవ్(కన్నా),విజయ్‌కుమార్‌మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాణిక్‌రెడ్డి, సర్పంచులు రాఘవేందర్‌రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, ఎరుకల శేఖర్, కౌన్సిలర్లు, మహేందర్‌రెడ్డి, ప్రశాంత్, మాజీ కౌన్సిలర్ శ్రీనాథ్, మాజీ సర్పంచులు శ్రీధర్, నర్సింహారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బద్దం సురేందర్‌రెడ్డి, అడ్వకేట్ ఉపేందర్‌రెడ్డితో పాటు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, యువజన నాయకులు, మైనారిటీ నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

కృష్ణ జిల్లా నిమ్మకూరులో నందమూరి హరికృష్ణ 70వ జయంతి వేడుకలు

- టీటీడీ కళ్యాణ మండపంలో ఉచిత మెగా వైద్య, రక్తదాన శిబిరాల నిర్వహణ
- ఎన్టీఆర్, హరికృష్ణ లకు నివాళులర్పించి పుష్పాంజలి ఘటించిన నేతలు



నిమ్మకూరు:సెప్టెంబర్ 02 ట్రైనెట్ న్యూస్,

చైతన్యరథ సారథి, మాజీ మంత్రి నందమూరి హరికృష్ణ 70వ జయంతి సందర్భంగా కృష్ణా జిల్లా నిమ్మకూరు గ్రామంలోనిటీటీడీ కల్యాణ మండపంలో బుధవారం ఉచిత మెగా వైద్య శిబిరం, రక్తదాన శిబిరం నిర్వహించారు.

ముందుగా ఎన్టీఆర్ స్వగ్రామం నిమ్మకూరులోని నందమూరి తారకరామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం హరికృష్ణ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి వైద్య, రక్తదాన శిబిరాలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీ ప్రభుత్వ విప్ గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు తో పాటు కార్యక్రమంలో నందమూరి రామకృష్ణ, పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా, పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, కృష్ణా జిల్లా టీడీపీ అధ్యక్షుడు వీరంకి వెంకట గురుమూర్తి, నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్, సూరపనేని హనుమంతరావు, డాక్టర్ సోమశేఖర్, చిన్నపాటి గాంధీ, గొట్టిపాటి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ హరికృష్ణ ప్రజల మధ్య తిరిగిన నాయకుడని, ఆయన పర్యటనలకు అపూర్వ ప్రజాదరణ లభించేదని గుర్తు చేశారు. 1995లో విద్యార్థిగా ఉన్న సమయంలో హరికృష్ణ పర్యటనను ప్రత్యక్షంగా చూసిన అనుభవాన్ని గుర్తుచేసుకుంటూ, విజయవాడ నుంచి గుడివాడ మీదుగా సాగిన ఆ యాత్రకు ప్రజలు గంటల తరబడి స్వాగతం పలికిన దృశ్యాలు ఇప్పటికీ కళ్లముందు మెదులుతున్నాయని చెప్పారు. రవాణా శాఖ మంత్రిగా హరికృష్ణ రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ట్రాక్టర్ పన్ను రద్దు వంటి నిర్ణయాలు తీసుకున్నారని పేర్కొన్నారు. గోదావరి వరదల సమయంలో జోలె పట్టి విరాళాలు సేకరిస్తూ బాధితుల కోసం కృషి చేసిన సేవాస్ఫూర్తిని గుర్తు చేసుకున్నారు. డ్రైవింగ్‌పై ఆయనకు ఉన్న మక్కువ, ప్రజలతో కలిసిమెలిసి ఉండే స్వభావం ఆయనను ప్రత్యేక నాయకుడిగా నిలబెట్టాయని అన్నారు. హరికృష్ణ సొంత గ్రామంలో ఆయన జయంతిని పురస్కరించుకుని రక్తదాన, వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు.